ప్రయాణం నరకప్రాయం

- రెండు కిలోమీటర్లలో 20 గుంతలు
- తరచూ ప్రమాదాలు
- గాయపడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

పరకాల : రెండు కిలోమీటర్లలో 20 గుంతలు, వారానికి రెండు, మూడు ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు, అధికారుల్లో చలనం రావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంతో మంది గాయాలపాలవుతున్నా అధికారయంత్రాంగం మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ దుస్థితి ఓ గ్రామానికో.. పట్టణానికో వెళ్లే రహదారికి అనుకుంటే పొరపాటే.. ఏకంగా జాతీయ రహదారి (353)లో నిత్యం ఇదే పరిస్థితి నెలకొంటుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరకాల చలివాగు వంతెన నుంచి మొదలయిన జాతీయ రహదారి.. చెన్నాపురం వరకు రెండు కిలోమీటర్ల దూరంలో 20 గుంతల ఏర్పడడంతో నిత్యం ఎక్కడో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయని కొందరు మృతిచెందిన సంఘటనలు ఉన్నాయని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అయితే గుంతలు ఏర్పడి ఏడాది దాటుతున్నా తాత్కాలిక పనులు చేపట్టి నేషనల్ హైవే అధికారులు చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇదే మార్గంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు భూపాలపల్లి నుంచి హనుమకొండ, హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరించడంపై స్థానికులు, వాహనదారులు ఆగ్రహిస్తున్నారు.


చలివాగు వంతెనపై ఏర్పడిన గుంతలు

రోడ్డెక్కాలంటే భయం

పరకాల నుంచి భూపాలపల్లి వెళ్లే రోడ్డెక్కాలంటే భయం వేస్తుంది. గుంతల కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గుంతలు కనిపించకపోవడంతో బైక్‌లు స్కిడ్ అవుతున్నాయి. పాలకులు, అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలి.

- గణేశ్, పరకాల

క్లుప్తంగా

నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ గురువారం పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని రైతు వేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎల్కతుర్తి బస్టాండ్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టంను ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడలకు ఎంజేపీ విద్యార్థులు



శాయంపేట : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రేవతి తెలిపారు. 14వ తేదీన బీమదేవరపల్లి మండలంలోని గాంధీనగర్ (మాణిక్యపూర్) గ్రామంలో బాల, బాలికల సబ్ జూనియర్స్ టోర్నమెంట్ ఎంపికలు చేపట్టినట్లు తెలిపారు. పరకాల జోనల్‌స్థాయి నుంచి శాయంపేట ఎంజేపీ విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు తెలిపారు. నేటి నుంచి 28వ తేదీ వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీఈటీలు సతీష్, ధన్‌పాల్, ఉపాధ్యాయులతో కలిసి అభినందించినట్లు తెలిపారు.

మోసం చేసిన మరో వ్యక్తి అరెస్ట్

శాయంపేట : ఇల్లు విక్రయిస్తామని బయానాగా కొంత డబ్బు తీసుకుని ముఖం చాటేసిన మామిడి సదాశివను బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు. కాగా ఇల్లు విక్రయిస్తామని తన భర్త నుంచి డబ్బులు తీసుకుని ఇల్లు రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసిన ముగ్గురు వ్యక్తులపై మండల కేంద్రానికి చెందిన బాల్నే తిలక్‌బాబు భార్య కవిత స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముగ్గురు వ్యక్తుల్లో ఒక మహిళను మంగళవారం అరెస్ట్ చేయగా బుధవారం సదాశివను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని పరకాల కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు

శాయంపేట : తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌ను బుధవారం బీఎస్ఎస్, బీఎస్‌యూ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. క్రాంతికుమార్, సుమన్, నరేష్, విజయ్‌కుమార్, సుధాకర్ ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి


మాట్లాడుతున్న దయాకర్‌రావు

నర్సంపేట/పర్వతగిరి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా పర్వతగిరి మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలు, కుల సంఘాలతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దయాకర్‌రావు మాట్లాడారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి.. చెన్నారావుపేట బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం వారు వేర్వేరుగా మాట్లాడుతూ.. రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల సందర్భంగా కార్యకర్తలకు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని, కష్టపడే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. మార్పులో భాగంగా నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అవకాశం కల్పించి ఎమ్మెల్యేగా దొంతి మాధవరెడ్డిని గెలిపిస్తే అభివృద్ధి అధోగతిపాలైందని సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. ప్రత్యేక నిధులతో చెన్నారావుపేట మండలంలో బ్రిడ్జిలు, చెక్‌డ్యాంలు, డబుల్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ మంజూరు చేశామన్నారు. రైతులకు యూరియా సరిపడా అందక పంటల దిగుబడి కోల్పోయారని, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు ప్రభుత్వం వెంటనే రూ.25వేల నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయా సమావేశాల్లో జిల్లా, మండల నాయకులు, గ్రామ కార్యకర్తలు, యూత్, సోషల్ మీడియా నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న క్రాంతికుమార్

శాయంపేట : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సొసైటీ కౌన్సిలర్ క్రాంతికుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని సురేఖ మండల సమాఖ్య సమావేశ మందిరంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్ పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో కొందరు సైబర్ నేరగాళ్లు అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వీడియోల ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. సైబర్ నేరాలకు గురైన బాధితులు 24 గంటల్లోపు 1930కు కాల్ చేసి రక్షణ పొందవచ్చని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో సైబర్ నేరాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, దీనికి కారణం అవగాహన లోపమన్నారు. ఈ కార్యక్రమంలో విడ్స్ కౌన్సిలర్ విజయ్ కుమార్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో క్రమశిక్షణ మెరుగు


ధర్మసాగర్ : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్


దామెర : విద్యార్థులను అభినందిస్తున్న ఏసీపీ

ధర్మసాగర్ : జ్ఞానంతో పాటు పని, శ్రమ, సమాజంపై ప్రేమను పెంపొందించేందుకు ఎన్ఎస్ఎస్ దోహదపడుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ అన్నారు. పీఓ మంజుల అధ్యక్షతన బుధవారం ఎన్ఎస్ఎస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ, వివేకానంద తాత్విక దృక్పథంలో 1969లో ఎన్ఎస్ఎస్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 15 నుంచి 25 సంవత్సరాల్లోపు విద్యార్థులు వారి లక్ష్యాలు సాధించేందుకు ఎన్ఎస్ఎస్ శిక్షణ కల్పిస్తుందని, క్రమశిక్షణ నేర్పుతుందన్నారు. అధ్యాపకులు ఆజం, బాబూరావు, రాములు, సదానందం, వెంకట్, గణేశ్, రాజేందర్, రవళి వేణు, గోపాలకృష్ణ, 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

దామెర : యూనిఫాం లేని సైనికులు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అని పరకాల ఏసీపీ సతీశ్‌బాబు అన్నారు. హనుమకొండ ఒకేషనల్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా ఐదోరోజు వలంటీర్లు పోలీస్ స్టేషన్ ఆవరణలో శ్రమదానం చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. దేశానికి యువత వెన్నెముక అన్నారు. శ్రమదానం చేసిన యువకులను అభినందించారు. పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు, దామెర ఎస్సై అశోక్ పాల్గొన్నారు.

పరకాల : విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) కీలక పాత్ర పోశిస్తుందని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ డాక్టర్ బేతి సంతోశ్‌కుమార్, సంపత్‌కుమార్ అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సర్దార్ పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



కమలాపూర్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని ప్రిన్సిపాల్ మాధవి అన్నారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కమలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులతో కలిసి కళాశాల అధ్యాపకులు తీరొక్క పూల పేర్చి బతుకమ్మ పాటలు పాడారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. బంధాలు, అనుబంధాలను గుర్తు చేస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ, తెలంగాణ వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పే పండుగ బతుకమ్మ అన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ డేని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీఓ జ్యోతి, స్టూడెంట్ కౌన్సిలర్లు కుమార్, రజిత, అధ్యాపకులు శ్రీనివాస్‌రెడ్డి, కవిత, శారద, చంద్రశేఖర్, శోభాదేవి, యామిని, సురేందర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశరాజుపల్లి వాసులకు అట్లాంటాలో బహుమతి



మండలంలోని దేశరాజుపల్లికి చెందిన కొనిశెట్టి మహేందర్–సుప్రియ దంపతులు యూఎస్‌లోని అట్లాంటాలో తెలుగు అసోసియేషన్ ఆఫ్ మెట్రో అట్లాంటా (టామా) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ప్రథమ బహుమతి సాధించారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ మెట్రో అట్లాంటా అధ్యక్షురాలు సునీత పోతునూరి చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. కాగా కొనిశెట్టి మహేందర్–సుప్రియ దంపతులు ప్రథమ బహుమతి గెలుచుకోవడం వరుసగా ఇది ఐదోసారి అవడం విశేషం.

చంద్రఘంట అలంకరణలో దుర్గామాత


ఐనవోలు : చంద్రఘంట అలంకరణలో భ్రమరాంబిక


ఆత్మకూరు : పూజలు చేస్తున్న భక్తులు


ఎల్కతుర్తి : గాయత్రీదేవి అలంకరణలో భద్రకాళి

ఆత్మకూరు : మండల కేంద్రంలోని పోచమ్మ సెంటర్‌లో గల వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వేణుగోపాలస్వామి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం మూడో రోజు వైభవంగా కొనసాగాయి. అమ్మవారిని చంద్రఘంట అలంకరణలో అలంకరించారు. అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ దంపతులు, డైరెక్టర్ కాడబోయిన రమేశ్ దంపతులు పాల్గొన్నారు.

ఐనవోలు : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం భ్రమరాంబిక అమ్మవారు చంద్రఘంట అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఉదయం సుప్రభాతసేవ, నిత్యాహ్నికం, చక్రోపనిషత్ పారాయణం, శ్రీచక్రార్చన, త్రిశతి పారాయణ తదితర కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు మధుకర్‌శర్మ, వేద పండితులు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు భాను ప్రసాద్, మధుశర్మ, శ్రీనివాస్, నరేష్ శర్మ, దేవేందర్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గాయత్రీదేవి అలంకరణలో..

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళి శరన్నవరాత్రి ఉత్సవాలు మూడోరోజు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భద్రకాళి అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమించ్చింది. కలశ స్థాపన, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, చతుషష్టిసహిత లలితా సహస్రనామ పారాయణం, వేదాలకు మూలమైన గాయత్రి అమ్మవారికి అష్టోత్తర శత నామావళి, చతుర్వేద పారాయణాన్ని అర్చకులు నిర్వహించారు. ఆలయ ఈఓ కిషన్‌రావు, అర్చకులు రాంబాబు, రాజయ్య, శ్రీకాంత్, సందీప్, శ్రావణ్, శరత్‌చంద్ర, శివకుమార్ భక్తులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియదర్శిని

కమలాపూర్ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా బుధవారం నిర్వహించిన స్త్రీల ప్రత్యేక వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ ప్రియదర్శిని 44 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి నాగరాజు మాట్లాడుతూ.. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 25, 27, 29, అక్టోబర్ 1, 2వ తేదీల్లో నిర్వహించే ప్రత్యేక వైద్య శిబిరాలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ నరేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గాదేవి మండపం వద్ద అన్నదానం


అన్నదానం చేస్తున్న బీజేపీ నాయకులు

పరకాల : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద బీజేపీ మాజీ కౌన్సిలర్ పూర్ణచారి ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం చేపట్టారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, జిల్లా మాజీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు జయంత్‌లాల్ పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- డీడబ్ల్యూఓ జయంతి


మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ జయంతి

దామెర : పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా సంక్షేమ అధికారి జయంతి అన్నారు. మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసంలో భాగంగా బుధవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహారం అధికంగా తీసుకోవాలని అన్నారు. ఐరన్ అధికంగా లభించే పదార్థాలు తీసుకోవడం మూలంగా ఎనిమియా భారిన పడకుంగా ఉండొచ్చన్నారు. పిల్లలు వయసుకు తగినంత ఎత్తు, బరువు ఉండే విధంగా చూడాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సమస్యలుంటే అంగన్‌వాడీ, ఆశాలకు తెలుపాలని అన్నారు. అనంతరం సామూహిక సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, ఎంపీడీఓ కల్పన, ఏపీఓ శారద, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సుమలత, సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ సిబ్బంది, పిల్లలు, తల్లులు, గర్భిణులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయొద్దు

- డిప్యూటీ డీఐఓ విజయ్‌కుమార్


మాట్లాడుతున్న విజయ్‌కుమార్

దామెర : జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయొద్దని డిప్యూటీ డీఐఓ డాక్టర్ విజయ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనతరం పలు రికార్డులు పరిశీలించి, మందుల స్టాకు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జ్వర పీడితులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యపరీక్షలు చేసుకోవాలని అన్నారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా బారిన పడే ప్రమాదం ఉందని అన్నారు. ఉచిత వైద్య శిబిరంలో జనరల్ ఫిజిషియన్ డాక్టర్ రవితేజ, గైనకాలజిస్టు డాక్టర్ రాజేశ్వరి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఇఫ్తికార్ అహ్మద్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేంద్రన్, సిబ్బంది అశోక్‌బాబు, పిట్టల శ్రీకాంత్, భాగ్యలక్ష్మి, వనిత, సురేందర్, వెంకటేశ్వర్లు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాతో నేలకు ఆరోగ్యం

- వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రాజిరెడ్డి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

పరకాల : నానో యూరియాతో కాలుష్యం తగ్గి నేల ఆరోగ్యంగా ఉంటుందని పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రాజిరెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో గల రైతు వేదికలో రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. వరిలో రెండో దఫాగా నానో యూరియా వినియోగించాలని సూచించారు. రైతులు వ్యవసాయశాఖ అధికారులు సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జగదీశ్వర్‌రెడ్డి, ఏఓ శ్రీనివాస్, ఎరువుల దుకాణాల డీలర్లు లక్ష్మణ్, రవీందర్, శివాజీ , రమేశ్, శ్రీమన్నారయణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో రోగ నిరోధక శక్తి

- సీడీపీఓ స్వరూప


మాట్లాడుతున్న సీడీపీఓ స్వరూప

కమలాపూర్ : తల్లిపాలు దేవుడిచ్చిన వరమని, ముర్రుపాలతో రోగ నిరోధక శక్తి పెంపొందుతుందని, బిడ్డ పుట్టిన గంటలోపు తప్పనిసరిగా ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ భీమదేవరపల్లి సీడీపీఓ స్వరూప అన్నారు. కమలాపూర్‌లోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం సందర్భంగా బుధవారం ముర్రుపాల ప్రాముఖ్యత, పిల్లలకు అనుబంధ ఆహారం ఇవ్వడంపై తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన 6 నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలని అన్నారు. తల్లిపాలతో బిడ్డకు కేన్సర్ రాకుండా ఉంటుందని, 6 నెలల తర్వాత అనుబంధ ఆహారం తినిపించాలన్నారు. కాన్పు, కాన్పునకు నడుమ రెండేళ్ల వ్యవధి ఉండాలని, అప్పుడే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. మూడేళ్లు దాటిన పిల్లలందరిని అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చేర్పించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలామృతం, పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పిల్లలకు స్థానిక పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో వైద్యపరీక్షలు చేశారు. సూపర్‌వైజర్ రేణుక, అంగన్‌వాడీ టీచర్లు పద్మకుమారి, పూర్ణిమ, రజిత, ఉమాదేవి, తిరుమల, అంకూస్‌బీ, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

పండుగ వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్

ఐనవోలు : బతుకమ్మ, దసరా పండుగ సెలవుల నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మామునూరు ఏసీపీ వెంకటేశ్ సూచించారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్వతగిరి ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, ఎస్సై శ్రీనివాస్‌తో కలిసి బైక్‌లపై పెట్రోలింగ్ నిర్వహించారు. బతుకమ్మ ఆడే స్థలాలను, ఆయా గ్రామాల్లోని సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. వరుసగా సెలవులు రావడంతో దొంగతనాలు జరిగే అవకాశం ఉందన్నారు. మహిళలు బతుకమ్మ వేడుకలు జరిగే ప్రాంతంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. బతుకమ్మ, దసరా వేడుకల్లో గొడవలు జరుగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని స్థానికులను కోరారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే డయల్ 100 ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగకా ఆయన కోరారు.

సీసీ రోడ్లు, కాల్వలు నిర్మించాలి


బురద రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఐనవోలు : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో సీసీ రోడ్లు, కాల్వలు నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలోని సమస్యలపై సర్వే నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో బీసీ, ఎస్సీ కాలనీల్లో అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా మారాయని తెలిపారు. తేలికపాటి వర్షానికి వరద నీరు రోడ్లపై చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. గ్రామంలో అర్హులైన చాలా మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదన్నారు. మండలంలో అనేక సమస్యలు నెలకొన్నాయని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు నారాయణరెడ్డి, ఉప్పలయ్య, యాకయ్య, నారాయణ, పద్మ, నాగమ్మతో సీపీఐ నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.